క్లుప్తంగా

బీజేపీ, శివసేన నేతలపై చర్యలు తీసుకోవాలి

నగరంపాలెం: లోకసభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీజేపీ కేంద్ర మంత్రి, నాయకులు, శివసేన ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు చిలకా విజయ్‌కుమార్ కోరారు. ఈ మేరకు బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్‌కు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలోఓ ఏఐసీసీ కార్యదర్శి ఉష, ఎమ్మెల్యే క్రమశిక్షణ కమిటీ చైర్మన్ లింగంశెట్టి ఈశ్వరరావు, ఏపీసీసీ ఉపాధ్యక్షులు కొరివి వినయ్‌కుమార్, లీగల్ సెల్ సుధీర్, విజయ్‌రాజ్, యువజన కాంగ్రెస్ నాయకులు జవహర్, సందీప్, బన్నీ, సుశీల్ రాజా పాల్గొన్నారు.

ట్రయాథ్లాన్ క్రీడాకారుడికి ఆర్థికసాయం



కొరిటెపాడు(గుంటూరు): నగరానికి చెందిన ట్రయాథ్లాన్ క్రీడాకారుడు వీసం వెంకట నాగ సాయి (అండర్ –13)కి వేద సీడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తులసి ధర్మచరణ్ రూ.10వేలను గురువారం తన కార్యాలయంలో అందచేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ట్రయాథ్లాన్ అనేది ఈత, సైక్లింగ్, పరుగు పందాలను మిళితం చేసే బహుళ–క్రమశిక్షణ కలిగిన క్రీడ అని తెలిపారు. విరామం లేకుండా వరుసగా రేసులను నిర్వహిస్తారని, అథ్లెట్ల ఓర్పు, బలం , బహుముఖ ప్రజ్ఞను పరీక్షించడానికి ప్రసిద్ధి చెందిన ఈ క్రీడను ఎంచుకుని రాష్ట్ర స్థాయిలో వెంకట నాగసాయి రెండుసార్లు గోల్డ్ మెడల్ సాధించడం అభినందనీయమని తెలిపారు. ఇంటర్నేషనల్ స్థాయిలో అక్టోబర్ 9వ తేదీ నుంచి 13 వరకు ఈజిప్ట్‌లో జరిగే పోటీల్లో వెంకట నాగ సాయి మన దేశం తరఫున పాల్గొనడం గుంటూరు జిల్లా వాసులకు గర్వకారణమని తెలిపారు. కార్యక్రమంలో నాగసాయి తల్లి వీసం శ్రీలక్ష్మి, రవికుమార్ పాల్గొన్నారు.

గాన కోకిల సుబ్బులక్ష్మికి ఘన నివాళి



లక్ష్మీపురం: అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో గురువారం స్వర్గీయ ఎం.ఎస్. సుబ్బులక్ష్మి జయంతి సందర్భంగా సభ్యులు ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, సంగీత విద్వాంసులు వి.ఎస్.ఎన్ మల్లేశ్వరరావు మాట్లాడుతూ గాన కోకిలగా సుబ్బులక్ష్మి ఎనలేని కీర్తి ప్రతిష్ఠలను సొంతం చేసుకున్నారని తెలిపారు. వెంకటేశ్వరస్వామి భక్తురాలిగా ఆయన వైభవాన్ని విశ్వవ్యాప్తం చేయడానికి ఎనలేని కృషి చేశారన్నారు. సీనియర్ గాయకురాలు సీహెచ్.రజని మాట్లాడుతూ సుబ్బులక్ష్మి ఆలపించిన బాలాజీ పంచరత్నాలు, అన్నమాచార్య కీర్తనలు, శ్లోకాలు, భజనలు, స్తోత్రాలు, విస్తృతంగా ప్రజల్లోకి వెళ్లాయని తెలిపారు. కార్యక్రమంలో కవి జమదగ్ని, ఇంజనీర్ ఘనశ్యామాచార్యులు, గాయకులు, కొల్లి శ్రీను, సంస్థ సీనియర్ సభ్యులు పాల్గొన్నారు.

షాపులో చోరీ

పట్నంబజారు: షాపు షట్టర్ తొలగించి చోరీకి పాల్పడిన సంఘటనపై కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తపేటలోని 60 అడుగుల రోడ్డులో ఉన్న ఎయిర్‌టెల్ షోరూంలో బుధవారం రాత్రి దుండగులు షాపు షట్టర్ తాళాలు తొలగించి ల్యాప్‌ట్యాప్, పలు రకాల వస్తువులు చోరీ చేశారు. షోరూం నిర్వాహకులు షేక్ బీబీ ఫిర్యాదు మేరకు కొత్తపేట పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

సమయపాలన పాటించడం తప్పనిసరి



పట్నంబజారు: బార్ అండ్ రెస్టారెంట్, హోటల్ యాజమాన్యం నిబంధనలకనుగుణంగా నడుచుకోవాలని కొత్తపేట పోలీసు స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ ఎం.వీరయ్య సూచించారు. స్టేషన్‌లో గురువారం బార్ అండ్ రెస్టారెంట్, హోటల్ యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌హెచ్‌ఓ మాట్లాడుతూ అర్ధరాత్రి వరకు ఇష్టానుసారంగా దుకాణాలు తెరిచి వ్యాపారాలు చేస్తే ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. ఫుడ్ సేఫ్టీ అధికారులు చెప్పిన విధంగా నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ, ఆహార పదార్థాలు అందించాలని సూచించారు. సమయపాలన పాటించకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

యథేచ్ఛగా తాగునీటి దందా

- కమిషనర్ ఆదేశాలు బేఖాతర్
- నీటిని అమ్ముకుంటున్న ఇంజినీరింగ్ అధికారులు



నల్లచెరువు రిజర్వాయర్‌లో ప్రైవేట్ వాటర్ ట్యాంకర్‌కు నీటిని నింపుతున్న దృశ్యం

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ పరిధిలో తాగునీటిని ప్రైవేట్ వాటర్ ట్యాంకుల ద్వారా కమర్షియల్, ఇంటి నిర్మాణదారులకు అమ్ముకుంటూ ఇంజినీరింగ్ అధికారులు సొమ్ము చేసుకుంటున్నారు. ఈ నెల 15న నగర కమిషనర్ పులి శ్రీనివాసులు గుజ్జనగుండ్ల, పెదపలకలూరులో రిజర్వాయర్లను పరిశీలించారు. ప్రైవేట్ వాటర్ ట్యాంకర్లకు నీటి సరఫరా చేసే ప్రక్రియ నిలిపివేయాలని ఆదేశించారు. అయినా ఇంజినీరింగ్ అధికారులు కమిషనర్ ఆదేశాలు పట్టించుకోవడం లేదు. యథేచ్ఛగా ప్రైవేట్ వాటర్ ట్యాంకులకు నీటిని సరఫరా చేస్తూ తమ జేబులు నింపుకుంటున్నారు.

లక్షల లీటర్ల నీటి తరలింపు

నగరపాలక సంస్థ పరిధిలో నల్లచెరువు, ఏటీ అగ్రహారం, హెచ్‌ఎల్‌ఆర్, స్తంభాలగరువు, బీఆర్ స్టేడియం, నెహ్రూనగర్, ఎల్‌బీ నగర్ తదితర రిజర్వాయర్ల వద్ద నీటి దందా నడుస్తోంది. ప్రైవేట్ ట్యాంకుల నిర్వాహకులు రూ.250 చొప్పున(ట్యాంకర్‌కు) చలనా కట్టి నీటిని కమర్షియల్ పనులు, ఇంటి నిర్మాణదారులకు అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నారు. ప్రతి రోజు పదుల సంఖ్యలో ట్యాంకర్ల ద్వారా కొన్ని లక్షల లీటర్ల నీటిని తరలిస్తున్నారు. కమిషనర్ ఆదేశించినా తమ వైఖరి మారదంటూ ఇంజినీరింగ్ అధికారులు నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారు. తాగునీటి సరఫరాపై సమగ్ర యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసే ప్రక్రియలో భాగంగా కమిషనర్ పులి శ్రీనివాసులు ప్రైవేట్ వాటర్ ట్యాంకర్లకు నిలిపివేయాలని ఆదేశించారు. త్వరలో వాటికి నీటిని అందించేందుకు ప్రత్యేక ప్రతిపాదనలు సిద్ధం చేస్తామని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినప్పటికీ కొంత మంది ఇంజినీరింగ్ అధికారులు పట్టించుకోవడం లేదు. ప్రైవేట్ వాటర్ ట్యాంకులకు నీటిని నింపి అమ్ముకోవడంపై ప్రజల నుంచి కూడా తీవ్ర విమర్శలు వస్తున్నాయి.

ఆక్రమణల తొలగింపునకు ప్రత్యేక కార్యాచరణ

కమిషనర్ పులి శ్రీనివాసులు



పట్నంబజారులో ఆక్రమణల తొలగింపును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నసీర్ అహ్మద్, కమిషనర్

నెహ్రూనగర్: ప్రజా ప్రయోజనాల దృష్ట్యా డ్రెయిన్లు, రోడ్లపై ఆక్రమణల తొలగింపునకు ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేశామని నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. ఆక్రమణల వల్ల ట్రాఫిక్ సమస్యతో పాటు మురుగు పారుదల లేక తీవ్ర సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని తెలిపారు. ఆయన గురువారం తూర్పు ఎమ్మెల్యే మహ్మద్ నసీర్ అహ్మద్, ప్రజా ప్రతినిధులు, అధికారులతో కలసి లాలాపేట మెయిన్ రోడ్డు, పట్నం బజార్ రోడ్డులో డ్రెయిన్లపై ఆక్రమణ తొలగింపు పరిశీలించారు. స్థానిక వ్యాపారులకు ఆక్రమణల తొలగింపుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ డ్రెయిన్ల ఆక్రమణల వల్ల వ్యర్థాలు అడ్డుపడి వర్షం నీరు రోడ్లు, ఇళ్లల్లోకి వెళ్లి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇప్పటికే నగరంలో ఐటీసీ ఎదురు, జీటీ రోడ్డు, ఓల్డ్ క్లబ్ రోడ్డులో ఆక్రమణల్ని తొలగించినట్లు చెప్పారు. రాబోవు రోజుల్లో నగరంలోని అన్ని ప్రాంతాల్లో డ్రెయిన్లపై ఆక్రమణలను తొలగిస్తామని వెల్లడించారు. ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ మాట్లాడుతూ పట్నంబజార్‌లో పలువురు ముందుకు వచ్చి ఆక్రమణల తొలగింపునకు సహకరించడం అభినందనీయమని తెలిపారు. త్వరలో పట్నంబజార్ రోడ్డులో ట్రాఫిక్ సమస్య పరిష్కారంతో పాటు ప్యాచ్ వర్క్‌లు చేపట్టనున్నట్లు వెల్లడించారు. అనంతరం పూల మార్కెట్ నుంచి కన్యకా పరమేశ్వరి దేవాలయం వరకు బీటీ రోడ్డు నిర్మాణ పనులకు కమిషనర్, ఎమ్మెల్యే కార్పొరేటర్లు, అధికారులు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎస్ఈ శ్యాం సుందర్, ఎంహెచ్‌ఓలు మధుసూదన్, రామారావు, కార్పొరేటర్లు ఖాజా మొహిద్దీన్ చిష్టి, సంకూరి శ్రీనివాసరావు, వర ప్రసాద్, ఈఈ కోటేశ్వరరావు, డీసీపీ శ్రీనివాసరావు, టీపీఎస్ సువర్ణ కుమార్, డీఈఈ శ్రీధర్, ఎస్ఎస్ రాంబాబు, ఏఈ సునీల్ కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మనోహర్‌బాబు పాల్గొన్నారు.

అన వేమారెడ్డి ట్రస్టు సేవలు అభినందనీయం

మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాలరెడ్డి



మాట్లాడుతున్న వేణుగోపాలరెడ్డి

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు నగర, జిల్లాలోని రెడ్డి బాలికల కోసం భోజన, వసతి గృహాన్ని ఏర్పాటు చేసి వేలాది మందిని విద్యావంతులుగా తీర్చిదిద్దిన అన వేమారెడ్డి ట్రస్ట్ కార్యవర్గ సభ్యుల విద్య, సామాజిక సేవలు అభినందనీయమని మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాలరెడ్డి పేర్కొన్నారు. స్తంభాల గరువులో ట్రస్ట్ ఆధ్వర్యంలో నడుస్తున్న రెడ్ల బాలికల వసతి గృహంలో గురువారం స్థలదాత సాంబిరెడ్డి 14వ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా 57 మంది విద్యార్థినులకు రూ.10వేలు చొప్పున ఉపకార వేతనాలతోపాటు బండి సాహితీరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ రూ. లక్ష ఆర్థిక సహకారంతో జ్ఞాపికలు అందించారు.కనిగిరి ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, నరసరావుపేట మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి మాట్లాడారు. ట్రస్టు సేవల్ని ప్రశంసించారు. చల్లా అంజిరెడ్డి అధ్యక్షత వహించిన సభలో డాక్టర్ మోదుగుల ప్రవీణ్ కుమార్‌రెడ్డి, డాక్టర్ ఎస్ఆర్‌కే రెడ్డి, బండి సుధావాణి అశోక్ రెడ్డి, గాదె సుజాత, చాగంటి రఘురామిరెడ్డి, ఉపకార వేతనాల కమిటీ చైర్మన్, స్థానిక కార్పొరేటర్ ఉడుముల లక్ష్మీశ్రీనివాస్ రెడ్డి, కంది సంజీవరెడ్డి, చాగంరెడ్డి శ్రీనివాసరెడ్డి, అన వేమ ట్రస్ట్ అధ్యక్షులు ఉడుముల శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యక్షులు పిచ్చిరెడ్డి, కార్యదర్శి వణుకూరి సూరారెడ్డి, కోశాధికారి ఉడుముల రాజేష్, సత్యనారాయణరెడ్డి, వసతి గృహం పర్యవేక్షకురాలు సుజాత, పలువురు నగర ప్రముఖులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

పట్నంబజారు: గుంటూరు డిపో–1 పరిధిలోని అమరావతి, క్రోసూరు, తుల్లూరు, పర్చూరు రూట్లలో ప్రయాణికుల సమస్యలు, సూచనల కోసం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని శుక్రవారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. ప్రయాణికుల సమస్యలు తెలిపేందుకు 9959225420 నంబరులో సంప్రదించాలని వారు సూచించారు.

ఆకట్టుకున్న తోలు బొమ్మలాట



నగరంపాలెం: స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై గురువారం రాత్రి తోలు బొమ్మలాట ప్రదర్శన ఆకట్టుకుంది. బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో శ్రీసాయి నిలయ తోలు బొమ్మలాట గ్రూప్ (కాకినాడ) వారు తెలుగు ప్రాచీన కళా రూపం ఉత్తర గోగ్రహణం ప్రదర్శించారు. తొలుత ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు, ఏఎన్‌యూ, మద్రాసు విశ్వ విద్యాలయం విశ్రాంత రిజి స్ట్రార్లు రావెల సాంబశివరావు, కోటేశ్వరరావు, ఉపాధ్యాయుడు మోదుగుల రవికృష్ణ జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. తోట బాలకృష్ణ, తోట నాగమణి, ఓడిమోని నూకరత్నం, తోట సత్యం, తోట అంజిబాబు, అనపర్తి పాపారావు, తోట మణికుమార్, తోట గణపతి బృందం పాండవుల అజ్ఞాతవాసం, బృహన్నల నాట్య గురుత్వం, కౌరవుల కుట్ర, ఉత్తర కుమారుని ప్రజ్ఞలు, ఉత్తర గోగ్రహణం చేసిన కౌరవులను అర్జునుడు ఓడించడం వంటి ఘట్టాలను పద్యాలు, గేయాలు, వచనంతో అద్భుతంగా ప్రదర్శించారు.

జన ఔషధ కేంద్రాల ఏర్పాటుతో చౌక ధరల్లో మందులు



గుంటూరు ఎడ్యుకేషన్: అన్ని వర్గాల ప్రజలకు చౌక ధరలకే ఔషధాలను అందించే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా జన ఔషధ కేంద్రాల ఏర్పాటు చేస్తోందని ఫార్మాస్యూటికల్ అండ్ మెడికల్ డివైజెస్ బ్యూరో ఆఫ్ ఇండియా (పీఎంబీఐ) నోడల్ అధికారి డాక్టర్ ఏ. హరికృష్ణ పేర్కొన్నారు. అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో గురువారం జన ఔషధీ కేంద్రాల ఏర్పాటుపై ఫార్మాస్యూటికల్ అఫైర్స్ విభాగం, ఇంటర్‌ప్రెన్యూర్‌షిప్ సెల్ సంయుక్త ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ హరికృష్ణ జన ఔషధీ కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు అవసరమైన మౌలిక వసతుల గురించి వివరించారు. ఆసక్తి గల ఫార్మాసిస్టులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సదస్సులో కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు, కరస్పాండెంట్ డాక్టర్ ఎస్. మధుసూదనరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వి. నాగభూషణం, ఫార్మాడీ డైరెక్టర్ పి. సీతారామయ్య, వైస్ ప్రిన్సిపాల్ ఏ.ప్రత్యూష, సీహెచ్ ప్రసాదరావు పాల్గొన్నారు.

ఆరోగ్య పరిరక్షణకు మందులు ఎంతో అవసరం



ర్యాలీ ప్రారంభిస్తున్న డాక్టర్ ఉమాజ్యోతి

గుంటూరు మెడికల్: ఆరోగ్య పరిరక్షణకు మందులు ఎంతో అవసరమని గుంటూరు జీజీహెచ్ ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ నీలి ఉమా జ్యోతి అన్నారు. జాతీయ ఫార్మసీ విజిలెన్స్ వారోత్సవాల్లో భాగంగా గురువారం జీజీహెచ్ నాట్కో క్యాన్సర్ సెంటర్,చలపతి ఫార్మసీ కళాశాల సంయుక్తంగా ఏర్పాటు చేసిన ప్రదర్శనను ఆమె జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రోగి మందులను సకాలంలో తీసుకోవడం వల్ల జీవితం విజయవంతమవుతుందని చెప్పారు. ఆరోగ్యానికి మందులు ఎంతో అవసరమని పేర్కొన్నారు. ర్యాలీ జీజీహెచ్ నుంచి నాజ్ సెంటర్, ఏసీ కళాశాల మీదుగా ఆసుపత్రికి చేరుకుంది. రోగి భద్రత.. మందుల బాధ్యత అంటూ ఫార్మసీ విద్యార్థినులు ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేశారు. గుంటూరు వైద్య కళాశాల ఔషధ శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో సుశ్రుత హాలులో మందుల భద్రతకు ఒక ముందడుగు కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఫార్మకాలజీ విభాగాధిపతి డాక్టర్ శంకర్, డాక్టర్ సాల్మన్‌రాజు, డాక్టర్ త్రివేణి, డాక్టర్ దుర్గాప్రసాద్, డాక్టర్ శివరామకృష్ణ, డాక్టర్ సతీష్ కుమార్, నాట్కో సమన్వయకర్త యడ్లపాటి అశోక్ కుమార్ పాల్గొన్నారు .

కార్పొరేటర్లను అవమానపరుస్తున్న అధికారులు

- 54వ డివిజన్ కార్పొరేటర్ మల్లవరపు రమ్య ఆవేదన
- టీడీపీ నాయకులకు అగ్రతాంబూలం

నెహ్రూనగర్: ప్రజాస్వామ్యబద్ధంగా కార్పొరేటర్లుగా గెలిచిన వారికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశాలు జారీ చేసినప్పటికీ కొంతమంది నగరపాలక సంస్థ అధికారులు అందుకు విరుద్ధంగా పదవులు లేని టీడీపీ నాయకులకు ప్రాధాన్యత ఇస్తున్నారని 54వ డివిజన్ కార్పొరేటర్ మల్లవరపు రమ్య ఆవేదన వ్యక్తం చేశారు. డివిజన్ పరిధిలోని 158, 159వ సచివాలయాలకు సంబంధించిన నోడల్ ఆఫీసర్ అకుల శ్రీనివాసరావు, అడ్మిన్ సెక్రటరీలు తనను ఏ కార్యక్రమానికి ఆహ్వానించకపోగా...గురువారం 54 టీడీపీ వార్డు ప్రెసిడెంట్‌ను పిలిపించి సెక్రటరీలకు దిశానిర్దేశం చేయడాన్ని ఆమె ఖండించారు. సచివాలయంలో ఎటువంటి అర్హత లేని వారిని పిలిపించి సమావేశాలు ఏర్పాటు చేసి, దళిత కార్పొరేటర్ తనపై వివక్ష చూపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా నగర కమిషనర్ తగిన చొరవ చూపాలని కార్పొరేటర్ రమ్య కోరారు.

కుష్ఠు వ్యాధిగ్రస్తులకు మెరుగైన వైద్యం : డీఎంహెచ్‌ఓ



సమీక్షలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ విజయలక్ష్మి

గుంటూరు మెడికల్: గ్రామాల్లో ఇంటింటికీ సర్వే నిర్వహించి కుష్ఠు వ్యాధిగ్రస్తుల వివరాలను సేకరించి, వారికి మెరుగైన వైద్య సేవలు అందేటట్లు చూడాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి తెలిపారు. జాతీయ కుష్ఠు నిర్మూలన కార్యక్రమం అమలుపై గురువారం తన కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. కార్యక్రమం వివరాలను డిస్ట్రిక్ట్ న్యూక్లియస్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ లక్ష్మానాయక్ భూక్య వివరించారు. జిల్లాలో ఈ సంవత్సరం ఏప్రిల్ 1 నుంచి ఇప్పటివరకు 61 కుష్ఠు వ్యాధి కేసులు నమోదైనట్లు తెలిపారు. ఇందులో స్త్రీలు 33 మంది, పురుషులు 25 మంది , పిల్లలు ముగ్గురు ఉన్నారని వెల్లడించారు. జిల్లాలో ఇప్పటివరకు రిజిస్టర్ అయిన 61 కేసులకు ఉచితంగా మందులు పంపిణీతో పాటు వైద్య సేవలు అందుబాటులో ఉంచామని ఆయన వివరించారు. డాక్టర్ కె. విజయలక్ష్మి మాట్లాడుతూ రోగులు అంగవైకల్యం బారిన పడకుండా కచ్చితమైన లకు సర్వేతో వీలైనంత వరకు మొదటి దశలోనే గుర్తించి చికిత్స అందించాలని చెప్పారు. సమావేశంలో టీహెచ్ వార్డ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వి. సోమల నాయక్, ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ రాజా ప్రదీప్ జయకర్ తదితరులు పాల్గొన్నారు.

అన్ని జిల్లాల్లో బీసీ భవనాలు, కమ్యూనిటీ హాళ్లు నిర్మించాలి

నెహ్రూనగర్: రాష్ట్రంలోని 26 జిల్లాల్లో పూలే పేరిట బీసీ భవనాలు, కమ్యూనిటీ హాళ్లు నిర్మించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. చుట్టుగుంటలోని సంఘ కార్యాలయంలో గురువారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. దశాబ్దాలుగా చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్లు కేటాయించాలన్న డిమాండ్‌ను సాకారం చేస్తూ 33శాతం రిజర్వేషన్ల అమలుకు రాష్ట్ర మంత్రి మండలి నిర్ణయం తీసుకోవడం హర్షించదగ్గ విషయమని పేర్కొన్నారు. బీసీల్లో 139 కులాల వారికి లబ్ధి చేకూరాలని కోరారు. 56 బీసీ కులాల వారీగా విడివిడిగా కార్పొరేషన్లను పునర్వ్యవస్థీకరించాలని ఆయన కోరారు. సమావేశంలో సంఘ నాయకులు కుమ్మర క్రాంతికుమార్, అన్నవరపు నాగమల్లేశ్వరరావు, కన్నా మాస్టర్, తన్నీరు ఆంజనేయులు, కోలా అశోక్, ముప్పాన వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఈవెంట్స్, మెయిన్స్ పరీక్షలు తక్షణమే నిర్వహించాలి



కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థి సంఘ నాయకులు

లక్ష్మీపురం: కానిస్టేబుల్ ఉద్యోగ అభ్యర్థులకు న్యాయం చేయాలని, ఈవెంట్స్, మెయిన్స్ పరీక్షలు తక్షణమే నిర్వహించాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఈ.భూషణం, కె.భాస్కర్ డిమాండ్ చేశారు. స్థానిక సెంట్రల్ లైబ్రరీ నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఈ.భూషణం , కె.భాస్కర్ మాట్లాడుతూ గత ప్రభుత్వం ఇచ్చిన 6,100 పోలీస్ కానిస్టేబుళ్ల భర్తీకి 95,208 మంది ప్రాథమిక రాత పరీక్ష రాసి అర్హత సాధించారని తెలిపారు. వీరికి ఇప్పటి వరకు దేహ దారుఢ్యం, మెయిన్స్ రాత పరీక్షలు నిర్వహించలేదని పేర్కొన్నారు.గత ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్‌లో హోంగార్డులకు రిజర్వేషన్లు పెంచడం వల్ల జనరల్ అభ్యర్థులకు తీవ్ర అన్యాయం జరిగిందని తెలిపారు. హైకోర్టులో హోంగార్డులకు అనుకూలంగా వచ్చిన తీర్పుతో జనరల్ అభ్యర్థులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని భావించి మార్కులతో సంబంధం లేకుండా తీసుకోవాలని డిమాండ్ చేశారు. రెండు సంవత్సరాల కాలయాపనలో అభ్యర్థులు పూర్తిగా నష్టపోయారని తెలిపారు. అధికారంలోకి వస్తే న్యాయం జరుగుతుందని, అభ్యర్థులంతా కలిసి కూటమి ప్రభుత్వాన్ని ఎన్నుకుంటే పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ప్రభుత్వం స్పందించి కానిస్టేబుల్ అభ్యర్థులకు ఈవెంట్స్, మెయిన్స్ పరీక్షలు నిర్వహించాలని, నిరుద్యోగ భృతి వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్దఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు మహర్షి, నాని, రాంబాబు, కానిస్టేబుల్ అభ్యర్థులు శ్రీనివాసులు, అనిల్ కాంత్, విజయ్, గురు, వెంకటాపతి పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ అధికారులు విస్తృత తనిఖీలు

రూ. 10లక్షలు అపరాధ రుసుం వసూలు



వివరాలు వెల్లడిస్తున్న విద్యుత్ అధికారులు

నెహ్రూనగర్: జిల్లా విద్యుత్ శాఖ విజిలెన్స్, ఆపరేషన్ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో గుంటూరు డీ–3 సెక్షన్ కొత్తపేట, ఆనందపేట, రైలుపేట, చౌత్రా సెంటర్, సాంబశివరావుపేటలలో గురువారం విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు కె.సూర్యప్రకాష్, టి.శ్రీనివాసబాబులు పర్యవేక్షణలో 59 మంది అధికారులు, 175 మంది సిబ్బంది, 59 బృందాలుగా ఏర్పడి 4,410 సర్వీసులను తనిఖీ చేశారు. అనుమతించిన లోడు కంటే అదనంగా విద్యుత్ వాడుతున్న 172 మందికి రూ. 10లక్షలు అపరాధ రుసుము విధించారు. శ్రీనివాసబాబు మాట్లాడుతూ విద్యుత్ మీటర్లకు తప్పని సరిగా సీలు ఉండేటట్లు చూసుకోవాలని వినియోగదార్లకు తెలిపారు. ఒక వేళ సీలు లేకపోయినా, తుప్పుపట్టి ఊడిపోయినా వెంటనే సంబంధిత విద్యుత్ సిబ్బంది రాతపూర్వకంగా తెలియజేయాలని సూచించారు. విద్యుత్ చౌర్యంపై ఫిర్యాదులు పూర్తి వివరాలతో 9440812263, 9440812360, 9440812361 నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు. దాడుల్లో డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు ఎం.రవికుమార్, కె.రవి కుమార్, సయ్యద్ ముస్తాక్ అహ్మద్, ఏఈలు కె.కోటేశ్వరరావు, ఎ.చంద్రశేఖర్, ఎం.చంద్రశేఖర్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


రాజధానిలో దళిత యూనివర్సిటీ ఏర్పాటు చేయాలి



ర్యాలీగా వస్తున్న ఇద్వా సంఘ నాయకులు

నెహ్రూనగర్: పునర్విభజన చట్టంలో దళితులకి అన్యాయం జరిగిందని, గిరిజనులకు మాదిరిగానే దళితులు కూడా యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని ఐడియా, ఇద్వా వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ గోళ్లమూడి రాజసుందరబాబు డిమాండ్ చేశారు. రెవెన్యూ కల్యాణ మండపంలో గురువారం ఐడియా, ఇద్వా సంఘాల 22వ వారికోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళితులకు ప్రత్యేక యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని కోరుతూ 2014 డిసెంబర్ 1న హైదరాబాదులో ముఖ్యమంత్రి చంద్రబాబును కలసి వినతి పత్రం ఇచ్చినట్లు తెలిపారు. దీనికి ముఖ్యమంత్రి కార్యాలయం స్పందించి దళిత యూనివర్సిటీ ఏర్పాటు కోసం వంద ఎకరాలు సేకరించాలని కలెక్టర్ కాంతిలాల్ దండే, గుంటూరు ఆర్డీవోకి, ఎమ్మార్వోకి రాసి లేఖ కూడా రాసినట్లు చెప్పారు. ఆ తర్వాత కాలంలో అది మరుగున పడిపోయిందని తెలిపారు. నేటి ముఖ్యమంత్రి ఆ అంశాన్ని మళ్లీ తిరిగి చేపట్టి రాష్ట్రంలో దళితుల కోసం అంతర్జాతీయ ప్రమాణాలతో యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఇద్వా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు భారతి, గౌరవ అధ్యక్షురాలు బడుగు విజయలక్ష్మి, కార్యదర్శి వెంకటరత్నం, సుశీల, అంబేడ్కర్ యూత్ నాయకులు కాళ్ల సాగర్ జోజులు పాల్గొన్నారు.

జాతీయ టెన్నికాయిట్ పోటీలకు విద్యార్థి ఎంపిక



గుంటూరు ఎడ్యుకేషన్: శ్రీకాకుళం జిల్లా వజ్రపు కొత్తూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఈనెల 14,15,16వ తేదీల్లో జరిగిన అంతర్ జిల్లాల టెన్నికాయిట్ పోటీల్లో గుంటూరు జిల్లా తరఫున పాల్గొన్న ఏ. లోకేష్ మారుతి బ్రహ్మారెడ్డి అత్యుత్తమ ప్రతిభ కనబర్చినట్లు ఉమ్మడి గుంటూరు జిల్లా టెన్నికాయిట్ కార్యదర్శి బి. రమేష్‌బాబు గురువారం తెలిపారు. జమ్మూ కశ్మీర్‌లో ఈనెల 30 నుంచి జరగనున్న జాతీయ స్థాయి పోటీలకు బ్రహ్మారెడ్డి ఎంపికైనట్లు వివరించారు. శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయురాలు డి. ప్రమీలను గుంటూరు జిల్లా టెన్నికాయిట్ అధ్యక్షుడు బి. శ్రీనివాస్‌రెడ్డి అభినందనలు తెలియజేశారు.

షర్మిల తెగిన గాలి పటం

బీజేపీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి లంకా దినకర్



గుంటూరు మెడికల్: షర్మిల తెగిన గాలి పటమని , ముందు తెలంగాణలో తన రాజకీయం.. ఆంధ్రతో పని లేదు అన్న మాట నిజమా కాదా ? అని బీజేపీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి లంకా దినకర్ ప్రశ్నించారు. గుంటూరు చంద్రమౌళీ నగర్‌లో గురువారం జరిగిన పత్రికా విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కుటుంబ తగాదాలు ప్రజల బాధలుగా మార్చే షర్మిల మాటలు పట్టించుకోనవసరం లేదని ఆరోపించారు. రాహుల్ గాంధీ దళితుల ఉన్నతిపై పనికి మాలిన వాఖ్యలు చేసిన సందర్భంలో కాంగ్రెస్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రాహుల్ గాంధీ పార్లమెంట్ ప్రతిపక్ష నేతగా అనర్హుడని , తనను తానే అపరిపక్వ వ్యాఖ్యలతో నవ్వులపాలు అవుతున్నారని విమర్శించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్ర కుమార్, పబ్లిసిటీ అండ్ లిటరేచర్ కన్వీనర్ పాలపాటి రవికుమార్ పాల్గొన్నారు.